రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషు హితవుపలికారు. గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సచివాలయ వలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. చంద్రబాబు హయాంలో అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. సీఎం జగన్ అర్హులైన వారికి కాపు నేస్తం అందిస్తున్నారని అన్నారు. కొన్ని పత్రికల్లో అవాస్తవాలు రాయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇప్పటికే సీఎం జగన్మోహన్ రెడ్డి, కాపు నేస్తం ద్వారా రూ.2 వేల కోట్లు ఇచ్చారని, రూ.500 కోట్లు మోసం ఎక్కడ జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు వార్తలు రాయడం మంచి పద్ధతి కాదని అన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు అధికారకాంక్ష తప్ప ప్రజల మీద ప్రేమ లేదని విమర్శించారు.

16న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-చేబ్రోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నమని ఎంపీడీఓ బాబూరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొక్కిలిగడ్డ సాహితి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

నులిపురుగులను నులిమివేద్దాం

విశాలాంధ్ర-కొల్లిపర : జేడీపీ పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణాదినోత్సవం సందర్భంగా కొల్లిపర సర్పంచ్ పిల్లి రాధిక గంగాధర్ చేతుల మీదుగా ఆల్బెండజోల్ టాబ్లెట్లను మింగించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ నులిపురుగులు మానవుని జీర్ణాశయం చిన్నప్రేవులను అంటిపెట్టుకొనుటవలన రక్తహీనత కలుగుతుందని తెలియజేశారు. చేతు లను భోజనానికి ముందు మలవిసర్జన తరువాత శుభ్రపరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి.సాల్మన్ రాజు, కె.ఝాన్సీ లత, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, గ్రామ వైసీపీ నాయకులు పిల్లి గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదా సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు చింపిరి శివ శంకరరావు, సీఆర్ పి.రమేష్ బాబు, హెల్త్ అసిస్టెంట్ సంగెపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫ్లిప్5, జెడ్ ఫోల్డ్5లకు 28 గంటల్లో లక్ష ప్రీ బుకింగ్‌లు

గుంటూరు: భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ ఇటీవల ప్రకటించిన ఐదవ తరం ఫోల్డబుల్ పరికరాల కోసం రికార్డు స్థాయిలో ప్రీ బుకింగ్‌లను అందుకుంది. మొదటి 28 గంటల్లో, భారతదేశం నుంచి ఒక లక్ష కన్నా ఎక్కువ మంది వినియోగదారులు గెలాక్సీ జెడ్ ఫ్లిప్5, జెడ్ ఫోల్డ్5లను ముందస్తుగా బుక్ చేసుకున్నారు. ఈ ప్రీ-బుకింగ్‌లు జూలై 27న ప్రారంభం కాగా, ఇవి ఈనెల 18 నుంచి విక్రయానికి అందుబాటులోకి రానున్నాయి.

టొయోటా నుంచి రూమియన్ విడుదల

గుంటూరు: టయోటా కిర్లోస్కర్ మోటర్ పూర్తి సరికొత్త టొయోటా రూమియాన్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఆకర్షణీయమైన, ప్రీమియం కొత్త ఫ్యామిలీ కార్‌లో సాటిలేని స్థలం, అద్భుతమైన ఇంధన సామర్థ్యంతో గొప్పగా చెప్పుకునే కొత్త కాంపాక్ట్ ఎంపీవీగా నిలుస్తుంది. ఇప్పటికే భారతీయ ఎమ్‌పివి విభాగంలో ముందంజలో ఉన్న ఈ సెవెన్-సీటర్ ఆవిష్కరణ మార్కెట్లో టయోటా ఉనికిని మరింత పెంచుతుందని భావిస్తున్నారు. బి-ఎంపీవీ విభాగంలోకి టయోటా ప్రవేశాన్ని సూచిస్తూ సౌలభ్యం, సౌకర్యం, విశ్వసనీయత, మనశ్శాంతి కోరుకునే కుటుంబాల కోసం పూర్తి సరికొత్త టయోటా రూమియన్ ప్రతిష్టాత్మకమైన, అనుకూలమైన ఎంపికను అందజేస్తుంది. పూర్తి సరికొత్త టొయోటా రూమియన్‌లో నియో డ్రైవ్ టెక్నాలజీ, ఈ-సీఎన్జీ టెక్నాలజీతో కూడిన శక్తివంతమైన కె సిరీస్ 1.5-లీటర్ పెట్రోల్ ఇంజన్ వుంది.

లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పార్లమెంట్ పరిధిలో జరగబోయే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి శ్రేణులు భారీ ఎత్తున తరలి విజయవంతం చేయాలనీ నియోజకవర్గ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర (నానీ) సూచించారు. గురువారం స్థానిక పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల్లో ఉన్న మహిళా నేతలు, మైనారిటీ నేతలతో సమావేశం నిర్వహించి పాదయాత్రకు భారీగా జనసమీకరణ, రవాణా, భోజనం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రహీం, లాల్ వజీర్, ఆదం, అస్మా, మహిళా నేతలు దాసరి జ్యోతి, పానకాల వెంకట మహా లక్ష్మి, నేపాక పద్మ, గంటా మౌలిక, సత్య వాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలపై సర్వే

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై గురువారం మంగళగిరి పట్టణంలోని ఎనిమిదో వార్డులో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే జరిగింది. ఈ సర్వేలో కరెంటు బిల్లు కాలిన దానికంటే ఇతర చార్జీలు విపరీతంగా పెరిగిపోయింది. రూ.250లు కరెంట్ బిల్లు కాలితే, ట్రూ ఆఫ్ చార్జీ, కస్టమర్ చార్జీ, లైన్ బాయ్స్ చార్జీ తదితర చార్జీలతో రూ.250లు అదనంగా పడుతుందని ఈ సర్వేలో వెల్లడైంది. ప్రతి కరెంట్ బిల్లు కూడా ఇదే విధంగా ఉంది. ఇతర బిల్లులను ఉపసంహరించుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు కె.శ్రీనివాసరావు, డి.రామారావు, ఎస్.నరసింహారావు, టి.హేమ సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఇచ్చిన దళిత హోదా కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన దళిత హోదా కల్పించాలని క్రిస్టియన్, మైనార్టీస్ రాష్ట్ర అడ్వైజర్ ఫాదర్ బాలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏసీ కళాశాల సమీపంలో ఉన్న అంబేద్కర్ భవన్‌లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ దళిత్ క్రిస్టియన్, ఆంధ్రప్రదేశ్ (ఎన్‌సీడీసీ)రాష్ట్ర అధ్యక్షులు కర్రా హనోక్ బెంజిమన్ ఆధ్వర్యంలో 'నేషనల్ ప్రొటెస్ట్' దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ మతం ఆధారంగా గత 72 సంవత్సరాలుగా దళిత క్రైస్త వులకు రిజర్వేషన్లు నిరాకరిస్తూ వస్తున్న వివక్షతను విడనాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎన్‌సీడీసీ రాష్ట్ర అధ్యక్షులు కర్రా హనోక్ బెంజిమన్ మాట్లాడుతూ క్రైస్తవ మతం తీసుకుంటే బీసీ-సీలు గానూ పరిగణిస్తూ వివ క్షతా పూరితమైన ఆర్డి నెన్స్ ఇవ్వటం జరిగిందని, ఆ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని గత 73 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు శాంతి యుత మార్గాలలో నిరసనలు వ్యక్తంచేస్తున్నామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి కిరణ్, సెక్రటరీ రేపూడి శాంతయ్య, పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

గుంటూరు సిటి, కొరిటెపాడు 3వ లైను, డోరు నెం.4-5-133రు కాపురస్తులు **పోలిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (లేటు)** గారి కుమారుడు **పోలిరెడ్డి శివారెడ్డి (సెల్: 9704603388)** అను నేను నా పేరిటకు నల్లపాడు సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన **విక్రయ దస్తావేజు నెం.7366/2012** ఒరిజినల్‌ను **ది.07-08-2023**న నల్లపాడు రిజిస్ట్రారు ఆఫీసు వద్ద పోగొట్టుకున్నాను. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులు: నివాస్

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు : పిల్లలలో రక్తహీనతకు ప్రధాన కారణం అవుతున్న నులిపురుగులు పూర్తి స్థాయిలో నిర్మూలనకు ఒకే రోజు పిల్లందరితో ఆల్బెన్డజోల్ మాత్రలు మింగించటం అతి ముఖ్యమైన కార్యక్రమమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పిల్లలతో ఆల్బెన్డజోల్ మాత్రలు మింగించే కార్యక్రమంను గురువారం సంగడిగుంటలోని సాదు చలమయ్య పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పిల్లల అనారోగ్యానికి కారణం అవుతున్న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సంవత్సరానికి రెండు సార్లు నిర్వహించటం జరుగుతుందని, దీనిని పటిష్టంగా అమలు చేయటానికి జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో మండల స్థాయి, మున్సిపల్ అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యారోగ్యశాఖ పనితీరును జిల్లా కలెక్టర్ నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. పిల్లలందరికీ ఒకేరోజు నులిపురుగుల నిర్మూలన మాత్రలు మింగించటం వలన నులిపురుగుల జీవిత చక్రం బ్రేక్ అవుతుందన్నారు. విద్యార్థులందరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ, చేతులు శుభ్రపరుచుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహించటం జరుగుతుందని, స్క్రీనింగ్ క్యాంపులలో పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని, అనారోగ్యం ఉన్న వారిని గుర్తించి పూర్తి స్థాయిలో వైద్యచికిత్సలు అందిస్తారన్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి నులిపురుగుల కారణంగా పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగదల లోపించి చదువుపై శ్రద్ధ లేకపోవటం, చిరాకు, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ముఖ్యంగా 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలు వయస్సు ఉన్న ఆడపిల్లలు రక్తహీనతకు గురై అనారోగ్యానికి గురి అవుతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు, డీగ్రీ రెండవ సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులందరి కోసం ఆరు లక్షల ఆల్బెన్డజోల్ మాత్రలు అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెన్డజోల్ మాత్రలను పంపిణీ చేసి, వారితో నమిలి మింగించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ ఎస్.శ్రీనివాసరావు, డైరక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ వి.రామిరెడ్డి, ఆర్బీఎస్‌కే స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.ప్రశాంత్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు, డీఈవో శైలజ, డీపీఎం డాక్టర్ సిహెచ్ రత్న మన్మోహన్, సాధు చలమయ్య విద్యాసంస్థల కరస్పాడెంట్ రామకృష్ణ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఓటర్ల వెరిఫికేషన్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 ఇంటింటికి ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు వివరిం చారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ఎస్‌ఎస్‌ఆర్ 2024 ఇంటింటికి ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమం, ఇతర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి, సూచనలు అందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 48శాతం ఇంటింటికి ఓటరు కార్డుల వెరిఫికేషన్ పూర్తి అయ్యిందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయానికి ఇంటింటికి ఓటర్ల జాబితా వెరిఫికేషన్ పూర్తి అయ్యేలా కార్యచరణ ప్రణాళిక రూపొం దించి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో నిరంతరం సమీ క్షిస్తూ, క్షేత్రస్థాయిలో బీఎల్వోలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఈఆర్వోలు, ఏఈర్వోలతో మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటికి ఓటరు కార్డులను బీఎల్వోలు వెరిఫికేషన్ చేస్తున్న విధానంపై నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలోను స్వయంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, ఎం.వెంకట శివరామి రెడ్డి, ఆర్‌డిఓ ప్రభాకర రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పరాకాష్టకు వైసీపీ పబ్లిసిటీ పిచ్చి : కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ కార్యాలయాలకి వైసీపీ రంగులు వేసి కోర్టులతో చివాట్లు తిన్న వైసీపీ నేతలు ఈ నాటికి కూడా అదే పంథాను కొనసాగిస్తూ, మహనీయులు పేర్లు తొలగించి, వైఎస్ఆర్ పేర్లు పెట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేడు దేవుళ్ల పేరుతో ఉన్న పార్కులను వదలని వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. స్థానిక 36వ డివిజన్‌లోని శ్రీ సీతారామ ఎంజీఓ పార్కు పేరును వైస్సార్ పార్కు పేరుగా మార్చటాన్ని ఖండిస్తూ, స్థానిక ప్రజలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ పార్కును అభివృద్ధిని చేయండని అడిగిన పాపానికి వైసీపీ రంగులతో పార్కును నింపేసి, రాత్రికి రాత్రే వైస్సార్ పార్కు అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు. ఇది హేయమైన చర్య, ప్రజల మనోభావాలని దెబ్బ తీసే విధంగా ఉందన్నారు. పార్క్ పేరును యధావిధిగా కొనసాగించాలి. లేకపోతే మునిసిపల్ కౌన్సిల్‌లో దీని మీద గట్టిగా పోరాడుతామని రవీంద్ర హెచ్చరించారు. కనపర్తి శ్రీనివాసరావు, ఈరంటి వరప్రసాద్, కసుకుర్తి హనుమంతరావు, దాసరి రమణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తెనాలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అరాచక పాలన నుండి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు సీపీఐ తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ గురువారం కఠెవరం, కంచర్లపాలెం గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని నాశనం చేస్తుందని విమర్శించారు. కర్ణాటకలో ఎన్నికల సందర్భంగా హిందువుల ఓట్లకోసం జైభజరంగ భళి నినాదంతో ప్రచారం చేసినా అన్ని రంగాల్లో విఫలమయ్యారని చెప్పారు. రాష్ట్రంలో పరిపాలన సక్రమంగా లేదని పరిశ్రమలు లేవు, కాలువలు లేవు, ప్రాజెక్టులు లేవు, ఉద్యోగాలు లేవు, ఐటి పరిశ్రమలు లేవని ఇది మహాదారుణం అని చెప్పారు. కేవలం పత్రికా ప్రకటనలో ప్రచారం చేయడం మినహా ప్రజలకు ఏ సౌకర్యాలు కల్పించడంలేదని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడేందుకు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించబోయే బస్సుయాత్రలో రైతులు, కూలీలు, మహిళలు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ బస్సు యాత్ర ఆగస్టు 17వ తేదీ విశాఖపట్నంలో మొదలై సెప్టెంబర్ 8వ తేదీన తిరుపతి నగరం చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, హేమంత్, వీరయ్య, జాన్సన్, యోసఫ్, విమల, మేరి తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ హాస్పిటల్‌లో విజయవంతంగా 'ఎంబోలైజేషన్' శస్త్ర చికిత్స

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు జిల్లా గొట్టిపాడు గ్రామానికి చెందిన 61 సంవత్సరాలు మహిళకు ఎంబోలైజేషన్ శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా నిర్వహించినట్లు ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సజ్జా పేర్కొన్నారు. కొత్తపేటలో ఉన్న లైఫ్ హాస్పిటల్‌లో గురువారం మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆపరేషన్‌కు సంబంధించిన డాక్టర్ కళ్యాణ చక్రవర్తి వివరించారు. పద్మావతి అనే మహిళ విపరీతమైన కంటి వాపుతో జులై 19న తమ హాస్పిటల్‌కు వచ్చిందన్నారు. దీంతో పరీక్షలు నిర్వహించి 'ఏవీ ఫిస్టుల్లా'అను వ్యాధి అని నిర్ధారించినట్లు తెలిపారు. ఇందుకు ఎంబోలైజేషన్ అనే సర్జరీ చేసినట్లు పేర్కొన్నారు. రూ.6లక్షలు అయ్యే ఖర్చును ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేసినట్లు చెప్పారు. సర్జరీ చేసిన వారంలోనే పేషంట్ యధాస్థితికి వచ్చారని తెలిపారు. ఇటువంటి సర్జరీ ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదన్నారు. తమ హాస్పిటల్ నందు అర్హులైన వారికి సజ్జా ఫౌండేషన్ ద్వారా ఉచిత త్రోంబెక్టమీ ఆపరేషన్లు చేస్తున్నట్లు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. అనంతరం కార్డియాలజిస్ట్ డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుండె సంబంధిత అపరేషన్లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టంచేశారు. న్యూరో సర్జన్ డాక్టర్ హేమంత్, డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ మారుతి ప్రసాద్, హాస్పిటల్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక గణపతి నగర్లోని ఇందిరానగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సుబ్బారావు హాజరై విద్యార్థులకు మాత్రలు వేశారు. హైస్కూల్లోని 1050 మంది విద్యార్థులకు గాను 928 మంది విద్యార్థులకు మాత్రలు వేశారు.హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఏఎన్‌ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో షాపర్స్ స్టాప్ మొదటి స్టోర్

విశాలాంధ్ర-గుంటూరు : భారతదేశపు ప్రధాన ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఓమ్నిఛానెల్ డెస్టినేషన్ షాపర్స్ స్టాప్ తన మొదటి స్టోర్‌ను ఏపీలోని గుంటూరు ఫీనిక్స్ పద్మావతి మాల్‌లో గురువారం ప్రారంభించింది. షాపర్స్ స్టాప్ లిమిటెడ్ కస్టమర్ కేర్ అసోసియేట్ ఎండీ, సీఈఓ వేణు నాయర్ మాట్లాడుతూ గుంటూరు లాంటి ప్రముఖ నగరంలోకి ప్రవేశించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. షాపర్స్ స్టాప్ అసాధారణ షాపింగ్ అనుభవాన్ని నగరానికి అందించనున్నట్లు తెలిపారు. ప్రఖ్యాత బ్రాండ్‌లు, ఎంపిక చేయబడిన ప్రత్యేకమైన సేకరణల కలగలుపుతో కస్టమర్‌ల విభిన్న అభిరుచులు, ప్రాధాన్యతలను అందించటానికి తాము అంకితభావంతో ఉన్నామన్నారు. షాపర్స్ స్టాప్ ఫస్ట్ సిటిజెన్ క్లబ్ మెంబర్‌షిప్ సభ్యులకు ప్రత్యేకమైన డిస్కౌంట్‌లు, వ్యక్తిగతీకరించిన స్టైలింగ్ చిట్కాలు, ప్రత్యేకమైన ఈవెంట్‌లకు యాక్సెస్‌తో సహా అనేక రకాల ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. ఫస్ట్ సిటిజన్ క్లబ్ సభ్యులు ప్రతి కొనుగోలుతో రివార్డ్ పాయింట్‌లను పొందుతారని చెప్పారు. గుంటూరులో షాపర్స్ స్టాప్ కొత్త వెంచర్‌లో ఆకర్షణీయమైన హోమ్‌స్టాప్ కార్నర్ ఉంటుందని, ఇందులో కస్టమర్‌లు తమ ఇళ్లను అధిక-నాణ్యత, ఆధునిక, సమకాలీన డెకర్, ఫర్నిషింగ్ ఉత్పత్తులు, సరికొత్త ట్రెండ్‌లు, బ్యూటీ ప్రొడక్ట్‌లు, హోమ్ యాక్సెసరీలను చూడవచ్చని అన్నారు.

లోకేష్ సహకారంతో రాట్నాల పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : పట్టణంలోని 5, 6 వార్డులకు చెందిన మహిళలకు టీడీపీ నాయకులు రాట్నాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపించిన మూడు రాట్నాలను టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో మహిళ లబ్ధిదారులైన ముగ్గళ్ల దుర్గ భవాని, రెడ్డి లక్ష్మి బూడిద శివలకు టీడీపీ నాయకులు గురువారం రాట్నాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు అన్నం నాగబాబు, 6వ వార్డు మాజీ కౌన్సిలర్ డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, 5వ వార్డు అధ్యక్షులు జొన్నాదుల వెంకటరామాంజనేయులు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పడవల మహేష్, గుంటూరు పార్లమెంట్ టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి పినపాటి జీవన్, నియోజకవర్గ టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు రాయపూడి కిరణ్, దుగ్గిరాల మండల ఐటీడీపీ కోఆర్డినేటర్ నన్నెపాగ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువరానిది

విశాలాంధ్ర-మేడికొండూరు: అమరవీరుల త్యాగం మరువ రానిదని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ నివాళులర్పించారు. మేడికొండూరు మండలం పేరేచర్లలో జరిగిన నాదేశం నా భూమి కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి మొక్కలను నాటి ప్రతిజ్ఞ చేశారు. దేశం కోసం ఎందరో అమరవీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని చెప్పారు. ఆఫలితమే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని మనం నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నం స్వప్న, జడ్పిటిసి కందుల సిద్ధయ్య, పలువురు వైఎస్‌ఆర్సిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం సత్య కుమారి పేర్కొన్నారు. పొన్నూరు కోర్టుల ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నందు రాజీపడి తగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చు అన్నారు. కక్షిదారులు వ్యయప్రయాసలకు లోనుకాకుండా ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోవలసినదిగా ఆమె కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు ప్రత్యక్షముగా హాజరు కావచ్చునని ఆమె తెలిపారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

విజ్ఞాన్స్ విద్యార్థికి బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూని వర్సిటీలోని ఎంటెక్ ఫుడ్ టెక్నాలజీ విభాగానికి చెందిన షేక్ సాధిక్ అనే విద్యార్థికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2023 అవార్డు, గోల్డ్‌మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని సాధించాడని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ' పేరుతో విజ్ఞాన్స్ వర్సిటీకు చెందిన షేక్ సాధిక్, మరికొందరు విద్యార్థులు గుంటూరు, తెనాలి ప్రాంతా లలో 800కు పైగా సామాజిక, సేవా కార్యక్రమాల ద్వారా 35 వేల మంది ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలను కల్పించడం వలన ఈ అవార్డు లభించిందన్నారు. ఈ విద్యార్థికి 'ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్ : స్పాట్‌లైటింగ్ ద వర్క్ ఆఫ్ యాన్ ఎమినెంట్ సోషల్ యాక్టివిస్ట్'గా గుర్తించి లండన్‌లోని హార్వర్డ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్ కూడా ఇటీవలే అందించిందని తెలియజేసారు. విద్య, వైద్యం, వృద్ధులు, అనాథలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి కోసం శ్రమించడం వలన ప్రతిష్టాత్మక ఇన్‌ఫ్లూయన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కూడా స్థానం పొందాడని వెల్లడిం చారు. షేక్ సాధిక్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అభినందించారు.

సకాలంలో వైద్య సదుపాయం అందించాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండలంలో వివిధ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్న రోగులను వైద్య సిబ్బంది గుర్తించి సకాలంలో తగిన వైద్య సదుపాయం అందించాలని గుంటూరు జిల్లా ఇమ్యూనిజేషన్ ఆఫీసర్(డి.ఐ.ఒ) సుబ్బరాజు అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో నుదురు పాడు పిహెచ్‌సి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్(ఎఫ్.డి.పి) కార్యక్రమాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐరిస్కులో ఉన్న గర్భవతులను సమగ్ర వైద్య సేవలు అందించేందుకు జి.జి.హెచ్‌కి తరలించాలని, గర్భతులను, బాలింత లను పరామర్శించి రెగ్యులర్‌గా షుగర్, బి.పి పరీక్షలు చేయాలని, విద్యార్థులకు సకాలంలో టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం హైస్కూల్‌ల్లో నులిపురుగుల దినోత్సవాన్ని ప్రారంభించి విద్యార్థు లకు మాత్రలను మింగించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్తేరు రాణి, ఎంపీహెచ్‌ఇవో తెనాలి లూర్దురాజు,హెల్త్ సూపర్ వైజర్ అబ్దుల్ రెహమాన్, హెల్త్ అసిస్టెంట్ బాబురావు, ఎ.యన్.యం.అంతోనీరాణి, హైస్కూల్ హెచ్.యం.ఇమ్మానియేలు మాష్టారు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు వాడాలి

విశాలాంధ్ర-తెనాలి : చెంచుపేట, ఏఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం గురువారం జరిగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఖాలేదా నశీం చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి, ఆగస్టులో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నులి పురుగులు ఉంటే ఎదుగుదలకు సమస్యలు ఎదురవుతాయని వివరించారు. నులిపురుగులను నిర్మూలించేందుకు ఒకటి నుండి 19 ఏళ్ల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అంగ న్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా మాత్రలు పంపిణీ జరుగుతుం దని చెప్పారు. ఆగస్టు 17వ తేదీన స్పెషల్ డ్రైవ్ కింద ఇంటింటి సర్వే చేసి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డా.మహిత ఆశాలు, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు రెగ్యులరైజేషన్

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి మండలం గ్రామము సర్వే నెం.201లో గల భూములను ఆక్రమించుకొని నివసిస్తున్న వారికి సదరు స్థలములను ప్రభుత్వ నిబంధనల మేరకు రెగ్యులరైజేషన్ చేయుటకు గాను గురువారం తహశీల్దార్ కార్యాలయంలో పలువురు సిబ్బందితో తహశీల్దార్ నాగిరెడ్డి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే రెగ్యులరైజేషన్ చేయనున్నట్లు పలువురు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సతీష్, ప్రశాంతి, వంశీ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పటంలో తోపుడు బండ్ల అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటంలో వీరంకి వాణి(కొబ్బరి కాయల వ్యాపారం), రాజులపాటి శివమ్మ(కూరగాయల వ్యాపారం) అనే ఇద్దరు మహిళలకు తోపుడు బండ్లు గురువారం అందజేయడం జరిగింది. చిరు వ్యాపారాలు చేసుకోవడానికి అద్దె బండికి అద్దె కట్టలేక ఇబ్బందిపడుతున్నామని వారికి సొంతంగా తోపుడు బండ్లు ఇప్పించవలసిందిగా ఎమ్మెల్యే ఆర్కేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామ వైసీపీ నాయకులు ద్వారా తోపుడు బండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు లచ్చి వెంకటేశ్వరరావు, మున్నంగి వివేకానంద రెడ్డి, తులసీదాస్, బ్రహ్మ రెడ్డి, వాకా గోపీ, వీరంకీ హరిప్రసాద్ గౌడ్, రామిరెడ్డి, మధు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి మహర్దశ

విశాలాంధ్ర-పొన్నూరు : ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరంలో ఉన్న పొన్నూరు పట్టణానికి మహర్దశ పట్టనుంది. పొన్నూరు పట్టణ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు తొలగింపుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఎన్నో అడ్డంకులను కోర్టు కేసులను అధిగమించి ఎట్టకేలకు ఆక్రమణ తొలగింపుకు ముహూర్తం ఖరారైంది. ఆ మేరకు ఇంటి యజమానులకు చెల్లించవలసిన నష్టపరిహారం సైతం వారి ఖాతాల్లో జమ అవుతున్నట్లు సమాచారం. దీనికి తోడు మున్సిపల్ అధికారులు సైతం ఆక్రమణ తొలగింపు సమయంలో షాపులు ఇళ్లలోని సామాన్లు సర్దుకోవాలని ఎలక్ట్రికల్ మీటర్లు సైతం ఫిట్టింగ్ చేయించుకోవాలని యజమానులకు సమాచారం ఇస్తున్నారు. తొలగింపు కార్యక్రమం ప్రారంభం అవుతున్నట్లు సమాచారం. ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోయి ఆక్రమణలతో ఇరుకుగా మారిన పొన్నూరు పట్టణం అభివృద్ధికి ఆమడం అంత దూరంలో ఎన్నో ఏళ్లుగా కొట్టుమిట్టాడుతున్న సంగతి విధితమే. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో అనేక హామీలతో పట్టణ అభివృద్ధికి మహర్దశ తెస్తామని చెబుతున్నప్పటికీ గత 30 సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ గాని నిలిచిపోయింది. ఆక్రమణలు తొలగించడం ద్వారా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి పట్టణ అభివృద్ధికి శ్రీకారం చుడతామని హామీలు ఇస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దీంతో పొన్నూరు పట్టణ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడిలాగే నిలిచిపోయింది. కోర్టు కేసులు నిధుల లేమి అధికారుల రాజకీయ నాయకుల నిర్లక్ష్యం అన్నీ కలిసి రోడ్డు విస్తరణ పనులకు ఆటంకంగా మారాయి. ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెబుతున్నప్పటికీ రోడ్డు విస్తరణ పనులు మాత్రం నిధుల లేమి కారణంగా కొంత నష్టపరిహారం కలెక్టర్ ఖాతాలో వేసినప్పటికీ మిగిలిన డబ్బు లేక పనులు నిలిచిపోయినట్లు తెలుపుతున్నారు. 2019లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.

తూటాకు తొలగించండి

ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పెదకాకాని : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం పెదకాకాని నుంచి గొల్లమూడి పోవు రోడ్డులో గల కొత్త కాలువ గుంటూరు ఛానల్ లాక్‌ల వద్ద కాలువను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి దానబోయిన భాస్కరరావు అధ్యక్షత వహించగా గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ గుంటూరు చానల్‌కి సంబంధించిన కాలువ 47 కిలోమీటర్లు పొడవు ఉందని, 1966వ సంవత్సరంలో నిర్మాణం చేపట్టి నాటి నుంచి నేటి వరకు అనేక వేల ఎకరాలకు నీరు అందిస్తూ తాగునీరు, సాగునీరుకు ఆదరణగా నిలిచిందన్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో కాలువ కట్టలు బలహీనమై ఎక్కడెక్కడ తెగిపోయే విధంగా తయారయ్యాయని దానికి తోడు కాలువ కట్టలపై తుమ్మ చెట్లు విపరీతంగా పెరిగిపోయాయని అలాగే కాలువ లోపల గుర్రపు నాడ తూటాకు విపరీతంగా పేరుకుపోయి నీరు రంగు మారి కలుషితమైపోయాయని నీరు తాగితే రోగాల భారీ పడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఈ కాలువ మరమత్తుల కోసం రూ.1.20 కోట్ల గ్రాంటు చేస్తే వర్షాకాలంలో తూతూ మంత్రంగా 2 మార్లుగా పనులు చేపట్టినప్పటికీ పొన్నూరు, పత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించిన గుర్రపు నాడ తూటాకు తీయకుండా ఆ మొక్కలపై మందు స్ప్రే చేయడం జరిగిందన్నారు. వర్షాలు అధికంగా కురిసినప్పుడు కాలువ కట్టలు తెగినట్లయితే వేలాది ఎకరాల పంట పొలాలు మొత్తం కూడా ముంపు జరిగి పంట నష్టం జరగక మునుపే యుద్ధప్రాతిపదికన కాలువ కట్టల పనులు చేయించి తూటాకు గుర్రపు డెక్క నాసులను తొలగించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా రైతులను సమీకరించి సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ఆలపాటి నాగేశ్వరరావు, సిరిబోయిన కృష్ణ, జొన్నల శ్రీనివాసరెడ్డి, వెంకయ్య, పున్నయ్య, కొండయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత

విశాలాంధ్ర-శావల్యాపురం : ఎదిగే వయస్సులో ఉన్న పిల్లలు తరుచుగా నులిపురుగుల బారినపడి రక్తహీనతకు గురవుతారని దీంతో వారి ఆరోగ్యం దెబ్బతింటుందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడుతూ శరీరంలో నులిపురుగులు ఉంటే పలు రకాల అరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, తప్పనిసరిగా ఆరు మాసాలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రత్నలత, ఏఎన్ఎం అమరలింగేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, శ్యామలత, వైసీపీ నాయకులు తూమాటి కబ్బారావు, నాగులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ

విశాలాంధ్ర-రెంటచింతల : చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం రెంటచింతలలోని మాస్యంలో గల ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణకై అల్బెండజోల్ మాత్రలను ఆమె అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన లేకపోవడంతో, అపరిశుభ్ర చేతులతో ఆహారం తీసుకోవడం వల్ల క్రిములు కడుపులోకి వెళ్లి వ్యాధులను కలగజేస్తున్నాయన్నారు. ఆ క్రిములను నిర్మూలించేందుకు ప్రతి సంవత్సరం రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలను ఆరోగ్యశాఖ విద్యార్థులకు అందజేస్తోందన్నారు. మండల వైద్యాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత ఏర్పడుతుందని, నివారణ మాత్రలు విధిగా వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్రా కృష్ణారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు కృషి చేయాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా 'నాభూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' అనే ప్రత్యేక కార్యక్రమాలను మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఎంపీపీ మేడం జయరాంరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రం, తిమ్మాపురం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిల సందేశాలను వినిపించారు. దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తుచేసుకుంటూ ఎంపిక చేసిన అమృత సరోవర్లు నీటివనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి వారికి ఘనంగా నివాళులర్పించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో ముగింపు సందర్భంగా 'వసుధకు వందనం' పేరుతో ప్రతి గ్రామంలోని 75 మొక్కలు నాటేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈఓపీఆర్‌డీ రవికుమార్, ఏపీఓ కట్టా నాగేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ వంగూరు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు, వీఆర్వో నరేంద్ర, మల్లంపాటి అంజిరెడ్డి, మేడం నాగిరెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-యడ్లపాడు : గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వారితో ఈ నెల 12వ తేదీన యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత న్యూరో కార్డియాలజీ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎంపీ పీఎంపీ పట్టణ గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీజీ, 2 డీ ఏకో, నరముల పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా ఇవ్వనున్నట్లు వివరించారు.

సుందరాచారి జయంతి

విశాలాంధ్ర-యడ్లపాడు : మండలంలోని మైదవోలు గ్రామంలో కల బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం శంకరంబాడి సుందరాచారి జయంతి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జీవీ హేమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌరు లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు పాల్గొని శంకరంబాడి సాహితీ జీవనం గురించి విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర గేయం మా తెలుగు తల్లికి మల్లె పూదండ గేయం రాసిన కవి శంకరబాడిద సుందరాచారి అని వివరించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి మేరీ, ఉపాధ్యాయులు సతీష్, ఉమామహేశ్వరి, షహనాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వార్డు ఉప ఎన్నికకు నామినేషన్ దాఖలు



విశాలాంధ్ర-బొల్లాపల్లి: ఉప ఎన్నికల కార్యక్రమంలో భాగంగా బొల్లాపల్లి మండలం లాలిపురం గ్రామం రెండవ వార్డు కు జరగనున్న ఉప ఎన్నికలకు సంబంధించి నేడు నామినేషన్ దాఖలైంది. తెలుగుదేశం పార్టీకి చెందిన దుర్గా భవాని నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జరపల గోవింద నాయక్, టిడిపి సీనియర్ నాయకులు వెంకటనారాయణ, మాజీ ఎంపిటిసి ఆళ్ల మునయ్య, ఎలి శెట్టి రంగయ్య, గుండె నాయక్, ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

యుద్ధ వీరులకు నివాళి

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రంలో కార్గిల్ యుద్ధ వీరులు మృతిచెందిన సయ్యద్ ఖాయాంను గుర్తు చేసుకుంటూ ఎన్ఆర్ఈజీఎస్ పిడి జోసఫ్ గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. మృతి చెందిన వీరుల కుటుంబాలను సన్మానించారు. రిటైర్ అయిన ఆర్మీ జవానులను సన్మానించారు. నా దేశం మా భూమి ప్రతిజ్ఞ చేశారు. మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగాలు అర్పించిన అమరవీరులను గుర్తు చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం నా భూమి నా దేశం కార్యక్రమం అన్ని గ్రామాల్లో ఆగస్టు 15 వరకు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఏపీఓ కోటేశ్వరరావు, రిటైర్డ్ ఆర్మీ జవాన్ వెంకటేశ్వర్లు, సుబ్బారావు, మౌలాలి , పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, ఉస్మాన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతుంది

వైసీపీ బాధితులకు అండగా ఉంటా
యువగళంలో నారా లోకేష్

విశాలాంధ్ర-క్రోసూరు : అవినీతి, అక్రమార్జన, దౌర్జన్యాలపై యువగళం వేదికగా తెలుగుదేశం పార్టీ పాదయాత్రను చేపట్టిందని నారా లోకేష్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని దొడ్లేరులో జిల్లాలోని నియోజకవర్గాల బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నేళ్లుగా పార్టీని, చంద్రబాబు నాయకత్వాన్ని నమ్ముకుని అండగా నిలబడ్డ ప్రతిఒక్కరికి తాను ఎంతో రుణపడి ఉన్నానని, పాదయాత్ర ద్వారా ప్రతిఒక్కరిలో చైతన్య స్ఫూర్తి నింపడానికి వైసీపీ దౌర్జన్యాలలో బాధితులుగా ఉన్న ప్రతి ఒక్కరితో తాను ఉన్నానంటూ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. నియోజకవర్గంలో ప్రవేశించినప్పటి నుంచి ప్రతి ఒక్కరూ తమ సొంత బిడ్డలా ఆదరిస్తున్నందుకు సర్వదా రుణపడి ఉన్నానన్నారు. వారి ఆశయాలు, ఆశలకు ఎల్లవేళలా కట్టుబడి ఉంటానన్నారు. రాష్ట్రంలో నిజాయితీ అంధకారంలో ఉందని, అరాచకం రాజ్యమేలుతుందని దానికి కొన్ని రాజకీయశక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అండగా నిలవడం చూస్తే ఎంతో బాధేస్తుందని అన్నారు. దీనిని నిలువరించడానికి, రాబోయే తరాలకు బాటలు వేయడానికి తెలుగుదేశం పార్టీ కష్ట పడుతుందని చెప్పారు. ప్రతి కుటుంబంలో ఇంజనీర్లుగా తయారై విదేశాలలో ఉంటూ తల్లిదండ్రు లను కష్టాలు, అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించడా నికి ప్రధాన కారణం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న విద్యపై విధానపరమైన నిర్ణయాలు మాత్రమే నని అన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకతీ తంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజకీయాలను సిల్లీగా గల్లీలో పల్లీల్లా అమ్ముకుంటూ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలలోకి వచ్చిన ప్రతి నేతకు తాను ఒకటే మాట చెబుతున్నానని... డబ్బు శాశ్వతం కాదు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోవడమే శాశ్వతం అనేది ప్రతిఒక్కరూ గుర్తె రిగి పనిచేయాలని, పార్టీ వారి కష్టాలను గుర్తిస్తుం దని ప్రజలలో ఉన్న వ్యక్తికే తమ అండ ఉంటుందని అన్నారు. పసుపు సైన్యం యాత్ర విజయవంతం కావాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని ప్రతి యువకుడు పాదయాత్ర ద్వారా చంద్రబాబు ఆశయాలను ప్రజ లకు చేరవేయడంలో చాలా కష్టపడుతున్నారని రాబోయే తొమ్మిది నెలలు కూడా ఇదేవిధంగా నీతినిజాయితీ కొలమానంగా పనిచేయాలని అన్నారు. సామాజిక వర్గాలకు అతీతంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని కులాలను, వర్గాలను పార్టీకి ఆపాదించి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడాన్ని గుర్తించారనడానికి పాదయాత్రలో పాల్గొంటున్న ప్రజలే దీనికి సూచికగా ఉన్నారని అన్నారు. ఆంధ్రుల రాజధాని అమరావతిని కేవలం వ్యక్తిగత ద్వేషంతో ప్రజలకు దూరం చేయడం తాము సహించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, వినుకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు వెన్నా సాంబశివరెడ్డి, క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, కొండవీటి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాడు భాషా, ఎస్సీ సెల్ నాయకులు దుద్దుల యోహాను, అచ్చంపేట మండల సీనియర్ పార్టీ నాయకులు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: విద్యార్థులకు శుభ్రతపై ఉపాధ్యాయులు నిరంతరం అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలతో ఆల్బెన్డజోల్ మాత్రలు మింగించే కార్యక్రమంను నరసరావుపేట మున్సిపల్ బాయ్స్ అండ్ గర్ల్స్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి అధ్యక్షత వహించగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థు లకు ఆల్బెన్డజోల్ మాత్రలను పంపిణీ చేసి, వారితో మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగదల లోపించి చదువుపై శ్రద్ధ లేకపోవటం, చిరాకు, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ముఖ్యంగా 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలు వయస్సు ఉన్న ఆడపిల్లలు రక్తహీనత గురై అనారోగ్యానికి గురి అవుతున్నారన్నారు. విద్యార్థులందరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ, చేతులు శుభ్రపరుచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నులిపురుగుల నిర్మూలన మాత్రలు తీసుకొని, ఆరోగ్యంగా ఉండాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ నులిపురుగులు-రక్తహీనత ఆ రెండింటికి ఉన్నటువంటి సంబంధం గురించి తెలియపరిచారు. డాక్టర్ హైందవి, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ జి.చంద్రశేఖర్ నిలుపురుగుల నివారణ గురించి సవివరంగా వివరించారు. డిఎంహెచ్ఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీలంతా సంఘటితమై పోరాటం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేయ కుండా ఎస్టీలను విస్మరిస్తూ వారిపైన దమనకాండను ప్రయోగిస్తున్నాయని గిరిజన సంఘాల నాయకులు బి.శ్రీనునాయక్, ఆర్.కృష్ణ నాయక్, కె.పాండు నాయక్, మాజీ కౌన్సిలర్, మహిళ సమైఖ్య ఏరియా కార్య దర్శి చెరుకుపల్లి నిర్మల, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ యునైటెడ్ ఫోరం ఫర్ రాష్ట్ర మహిళా అధ్యక్షు రాలు నూతక్కి కృష్ణ రేఖ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు మద్దుల వెంకట కోటయ్య అన్నారు. పట్టణం లోని పొట్టిశ్రీరాములు కాంప్లెక్స్‌లో గల మెడికల్ హాలులో గురువారం అంతర్జాతీయ గిరిజన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మణిపూర్ ఘటనను మొదలుకొని ఆంధ్ర రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి వరకు చూస్తే ఎక్కువగా గిరిజనులకు అన్యాయం జరిగిందని, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల్లోనూ కోతలు విధించటమే కాకుండా గిరిజనులకు సంబంధించిన నిధులను సంక్షేమ పథకాలు మళ్లించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇటువంటి ప్రభుత్వాలపై గిరిజనులంతా సంఘటితమై పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ నియోజకవర్గంలో సుమారు 20 వేల పైచీలుకు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఉన్నాయని, రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. అనంతరం ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి కుంభ నాగేశ్వరరావు, సుగాలి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీను నాయక్, గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు పాలపర్తి శ్రీనివాసరావు, బి.చిన్న నాయక్, ఉయ్యాల బలరాం, కె.వాగ్యా నాయక్, తోకల పాపారావు, బి.రాంబాబు, కె.నాగేశ్వరరావు ఆర్.శివనాయక్, శేఖర్ నాయక్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాసు పృథ్వి సాయి, గౌరవ సలహాదారులు కొంద్రముట్ల నాగేశ్వరరావు, వెంకట్ బుల్లోడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడలేదు..

విశాలాంధ్ర-కారంపూడి : నేను అవినీతికి పాల్పడినట్లు మిరియాల సర్పంచ్ ఏడుకొండలు నాపై అసత్య ఆరోపణలు సర్వసభ్య సమావేశంలో చేసారు. అందులో ఎటువంటి వాస్తవం లేదని హౌసింగ్ ఏఈ జయరాజుబాబు గురువారం విలేకరులకు తెలిపారు. నేను మిరియాల సచివాలయం స్వీపర్ వద్ద డబ్బులు తీసుకోలేదని స్వీపర్‌కు ఆర్థిక సహాయం చేసానని తెలిపారు. స్వీపర్ ఉప్పుతోళ్ళ యేసయ్య మాట్లాడుతూ నాకు ఇంటి నిర్మాణానికి డబ్బులు అవసరమైతే ఏఈ జయరాజుబాబును అడగగా డబ్బులు సహాయం చేసారు. నాకు ఆర్థిక వెసులుబాటు కలిగితే తిరిగి ఏఈకు డబ్బులు ఇచ్చాను. నన్ను ఏఈ లంచం అడగలేదు. నేను ఆయనకు పని నిమిత్తం నేను ఎటువంటి డబ్బులు ఇవ్వలేదు. ఏఈ అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణ అవాస్తవం అని యేసయ్య విలేకరులకు తెలిపారు.

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకోవాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని సర్పంచ్ బోడోల వీరాంజనేయులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న నా భూమి నా దేశం కార్యక్రమాన్ని బొందిలపాలెం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్ అధ్యక్షతన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జాతి ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సుగుణ, టీఏ రోజారాణి, ఏఫ్ఏ గొంగడి కోటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ అనిల్, చింతా విజయ్ కుమార్, అల్లూరి వెంకట్రావు, బోడాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వార్డుకు సీపీఐ అభ్యర్థి నామినేషన్

విశాలాంధ్ర-చిలకలూరిపేట : వేలూరు గ్రామ పంచాయతీ 4వ వార్డు సీపీఐ అభ్యర్థిగా బొంతా నాగరాజు నామినేషన్ దాఖలు చేశారు. గురువారం గ్రామంలోని సచివాలయంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంఈఓ లక్ష్మీకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, గ్రామ పార్టీ కార్యదర్శి కందిమళ్ళ వెంకటేశ్వర్లు, రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు తాళ్లూరి బాబురావు, గ్రామ పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు పాలుపంచుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. విద్యారంగంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ కృషి ప్రభుత్వ పాఠశాల కార్యక్రమాలలో తల్లిదండ్రుల చురుకైన భాగ స్వామ్యం అవసరమని చైర్మన్ ఎం.సురేంద్ర రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రారంభిం చబడిన కార్యక్రమాలు గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సుధ వివరించారు. జగనన్న విద్యా కానుక విద్యార్థులకు కిట్‌లు అందజేస్తున్నట్లు, పాఠశాలల్లో విద్యార్థులు నమోదును పెంచడం, డ్రాపౌట్‌లను తగ్గించడం, అక్షరాస్యతను మెరుగు పరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి మన బడి, నాడు-నేడులో అమలుపరచడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, ఏ.నీలిమ, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్న హస్తం సీఎం రిలీఫ్ ఫండ్

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ అందరికి ఉపయోగపడుతుందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. గుంటూరులోని శాసనసభ్యుడి కార్యాలయంలో లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. అమరావతి మండలం మల్లాది గ్రామానికి చెందిన గోనెల శివాజీకి రూ.43 వేలు, అమరావతికి చెందిన లక్ష్మి శారదకు రూ.55 వేలు, క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన సయ్యద్ మహమ్మద్‌కు రూ.45 వేలు, పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామానికి చెందిన మైనేని సతీష్‌కు మంజూరైన రూ.18 వేలు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనారోగ్యంతో బాధపడే వారు, వైద్యానికి ఖర్చు పెట్టే స్థోమత లేని వారు సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధిని ఆశ్రయించవచ్చన్నారు. పేదలకు సాయం చేసేందుకే సీఎంఆర్‌ఎఫ్ ఉందని.. ఎన్నో జీవితాలను నిలబెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు మైనేని నరేంద్ర నిమ్మ విజయసాగర్ బాబు, భవిరిశెట్టి హనుమంతరావు, క్రోసూరు జడ్పీటీసీ సభ్యులు గఫూర్ శ్రీనివాస్, రెడ్డి చిలకా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణపై అవగాహన

విశాలాంధ్ర-అమరావతి : జాతీయ నులుపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన అమరావతిలో ఏర్పాటుచేసిన సదస్సులో స్థానిక ఎంపీడీవో పి.ఉమాదేవి, అమరావతి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మేకల హనుమంతరావు, విజయలక్ష్మి అమరావతి మెడికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొని నులిపురుగు నివారణపై సదస్సులో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం నులిపురుగు నివారించేందుకు టాబ్లెట్స్‌ని విద్యార్థుల చేత మింగించారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయంలో ఆడిట్

విశాలాంధ్ర-అమరావతి : అమరావతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్‌కుమార్, విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి సోషల్ ఆడిట్‌లో భాగంగా వివిధ రకాల ఫైల్స్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ మేకల హనుమంతరావు, అమరావతి మండల ప్రజా పరిషత్ అధికారిని పి.ఉమాదేవి, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మండల పరిషత్తు కార్యాలయంలో నూతనంగా ఎన్నిక కాబడిన ఏడుగురు వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-నాదెండ్ల : మండలంలోని గొరజవోలు గ్రామంలో కేవీఆర్ ఫౌండేషన్, శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నాదెండ్ల మండల సొసైటీ చైర్మన్ కురుగుంట్లా వెంకటరెడ్డి తెలిపారు. ఎంపీపీ పాఠశాలలో నిర్వహించనున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరంను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినీ ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ ఉచిత కంటి శిబిరంలో లభించే కంటి వైద్య సేవలను గొరజవోలు గ్రామ, పరిసర ప్రాంతాల్లో ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైద్య సేవల కోసం వచ్చే వారు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకొనిరావాలని సూచించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ ప్రాంతీయ కేంద్రంలో 50వ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం పల్నాడు జిల్లా కార్యదర్శి యం.రవిబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పల్నాడు జిల్లా అధ్యక్షులు పి. ప్రేమ్ కుమార్ పతాకావిష్కరణగావించి, యూటీఎఫ్ ఉద్యమ చరిత్ర మరియు ప్రస్తుత విద్యారంగ పరిణామాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన యుటిఎఫ్ సీనియర్ నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు ఏ. నాగేశ్వరరావు నాటి ఉద్యమ అనుభవాలను, ప్రస్తుతం పరిస్థితులలో సంఘ ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుతం పరిస్థితులలో సంఘాన్ని మరింతగా బలపరుచుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి ఆర్. అజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ యం. పోలయ్య, విశ్రాంత సీనియర్ మహిళా బాధ్యులు రాజ్యలక్ష్మి 5 మండలాలకు సంబంధించిన యు.టి.యఫ్ బాధ్యులు పాల్గొన్నారు.

పేదలు భోజనాలు చేసేందుకు ఆంక్షలేంటి?

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చిలకలూరిపేటలో పేదోడికి పట్టెడన్నం పెట్టకుండా ఆంక్షలేంటంటూ మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మండిపడ్డారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నిరుపేదలు భోజనాలు చేస్తున్న అన్న క్యాంటీన్ భవనానికి తాళాలు వేయడంపై ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారని, రహదారిపై భోజనాలు చేసేందుకు పేదలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ నిరుపయోగంగా ఉండటంతో దాన్ని శుభ్రం చేయించి సుందరంగా చేశారన్నారు. మొబైల్ అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు వడ్డించుకొని భవనంలోకి వెళ్లి పేదలు భోజనాలు చేస్తున్నారు. ఉన్నపళంగా అన్న క్యాంటీన్ భవనానికి మున్సిపల్ అధికారులు తాళాలు వేశారని తెలిపారు.

హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారం అందజేత



విశాలాంధ్ర-చిలకలూరిపేట : పట్టణంలోని గుండయ్యాతోటలోని రోష్ని సర్వింగ్ సొసైటీలో ఆరా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో జీవించే వారికి ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జెంట్స్ టైలర్ రషీద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 95 మంది వ్యక్తులకు డాక్టర్ ఆర్‌వీ సుబ్రమణ్యం వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలు తెలిపారు. రషీద్ మాట్లాడుతూ అందరూ మానసిక ధైర్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. సంస్థ ప్రతినిధి జిలానీ బాషా మాట్లాడుతూ ప్రతి నెల రెండవ గురువారం తమ రోష్ని సర్వింగ్ సొసైటీలో హెచ్ఐవీతో జీవించే వారికై ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఆరా ఫౌండేషన్ అధినేత మస్తాన్ సహకారంతో ఉచిత మందులు, పౌష్టికాహారంతో పాటు భోజన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవీ రమణ, సుధాకర్, అనిత, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి యువగళం పాదయాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకూరపాడు: ఈ నెల 11, 12 తేదీలలో నారా లోకేష్ యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. గురువారం శ్రీధర్ మాట్లాడుతూ ఈనాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ముఖ్యంగా క్రోసూరు మండల పరిధిలోని దొడ్లేర్లు లంచ్ బ్రేక్ తర్వాత పాదయాత్ర ప్రారంభమై అనంతవరం క్రోసూరులో రాత్రి బస 11వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకి క్రోసూరులో మూడు గంటలకు బహిరంగ సభ అనంతరం అందుకూరి మీదగా గారపాడు రాత్రి బస, 12వ తేదీ ఉదయం గారపాడు క్యాంప్ సైట్ నుంచి ఏడున్నరకు పాదయాత్ర ప్రారంభమై గారపాడు నుంచి లగడపాడు పెదకూరపాడు లంచ్ బ్రేక్ సాయంత్రం 4 నుంచి పాదయాత్ర ప్రారంభమై పెదకూరపాడు మండల పరిధిలోని లింగంగుంట్ల పొడపాడు ముగింపు చేసుకొని తాటికొండ నియోజకవర్గంలో ఎంట్రీ అవుతుందని తెలిపారు. నల్లమేకల వెంకటేశ్వరరావు, పాటిబండ్ల బాలయ్య, నందిగామ అశ్వరావు, బత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

8654 మందికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర-పెదకూరపాడు : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా పెదకూరపాడు మండలంలో 8654 మందికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు మండల పరిధిలోని 75 తాళ్లూరు జేబీ పాఠశాల కార్యాలయంలో గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈద సాంబిరెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ క్షమారాణి, వైసీపీ నాయకులు మల్లెల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

విశాలాంధ్ర-శావల్యాపురం : ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియకు సంబంధించి ఉన్నతాధికారులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహించాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి కందుల శ్రీరాములు అన్నారు. శావల్యాపురంలో జరుగుతున్న ఓటర్ల సర్వేని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్వోలు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. ఒకే డోర్ నంబరులో 10కి మించి ఓటర్లుంటే పరిశీలించి, మార్పులు, చేర్పులుంటే సంబంధిత ఫారంలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. కొత్త ఓటర్లను, చనిపోయిన ఓటర్లను, స్థానికంగా లేనివారిని, ఓటు కార్డులలో సవరణలను గుర్తించి వారిచే దరఖాస్తు చేయించాలన్నారు. రెండు చోట్లు ఓట్లున్న ఉన్నవారిని గుర్తించి వారి అభీష్టం మేరకు ఒకచోట ఓటుహక్కును తొలగించాలని, ఓటుకు ఆధార్ లింక్‌పై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి నూరుశాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ఓటర్ల సర్వేలో బీఎల్వోలు ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి షేక్ జాన్ సైదులు, వీఆర్వో రాధ, బీఎల్ఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్దాల కోరు పార్టీ టీడీపీ: ఎమ్మెల్యే బొల్లా..

విశాలాంధ్ర-వినుకొండ: భారతదేశవ్యాప్తంగా పెద్ద అబద్దాలకోరు . రాజకీయ పార్టీ ఉందంటే అది తెలుగుదేశం పార్టీ ఏ న నీ. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద అబద్దాలు కోరని. అదే స్ఫూర్తితో అయన తనయుడు నారా లోకేష్ బాబు. టిడిపి నాయకులు. అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. తాను వినుకొండలో ఇసుక. మట్టి. అక్రమంగా తరలించుకుపోతున్నానని జీవి ఆంజనేయులు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు జీవి పై ఆగ్రహించారు. ఆయా ప్రాంతాలలో పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు తమ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక మట్టి తరలించు పోతుంటారని ఇది ప్రజలందరికీ తెలుసునని జీవి ఆంజనేయులు ఆ గోతులను మీడియాకు చూపెట్టి తనపై బురద చల్లుతున్నాడని ఎమ్మెల్యే ఆగ్రహించారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా చేసిన జీవీ ఆంజనేయులు. వినుకొండను అభివృద్ధి చేసి ఉంటే 30,000 మెజార్టీతో తనను ప్రజలు ఎలా గెలిపించారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. సమావేశంలో వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి. కే దేవరాజ్. గోనుగుంట్ల హనుమయ్య. జడ్పిటిసి. జడ్డా రామయ్య పాల్గొన్నారు.

వేలం ప్రకటన నోటీసు
మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి 36/2021 ఇన్ ఓ.యస్. 117/2019

బిట్వీన్:
నిడమనూరి రామక్రిష్ణయ్య తండ్రి కన్నయ్య, వయస్సు 65 సం॥లు, హిందూ, వ్యవసాయం, గరికపాడు గ్రామం, బొల్లాపల్లి మండలం, పల్నాడు జిల్లా
- పిటిషనర్ / డి. హెచ్. ఆర్

వర్సెస్
వెంపరాల శ్రీనివాసరావు తండ్రి మల్లయ్య వయస్సు 41 సం॥లు, హిందూ, వ్యవసాయం, గరికపాడు గ్రామం, బొల్లాపల్లి మండలం, పల్నాడు జిల్లా
- రెస్పాండెంట్ / జె.డి.ఆర్

పై నెంబరు అమలు డిక్రీ నందు ఇందలి డి.హెచ్.ఆర్ డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్‌కు చెందినటువంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని జప్తు చేయమని కోరుచూ దావాతో పాటుగా జప్తు పిటిషన్ దాఖలు చేసుకొనగ శ్రీ కోర్టు వారు ఆర్డర్ మేరకు సదరు ఈ క్రింది షెడ్యూలు ఆస్తి కోర్టు అమ్మీనా గారిచే జప్తు చేసియున్నారు. సదరు జప్తు పిటిషన్ ఐ. ఎ నెం.302/2019 అయివున్నది. కాగా జప్తు చేయబడిన సదరు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పబ్లిక్ వేలంలో వేలం వేయించి డిక్రీ బాకీని వసూలు చేసి ఇప్పించవలసినదిగా కోరుతూ ఇందలి డి. హెచ్.ఆర్ వారు డిక్రీ అమలు పిటిషన్ను దాఖలు చేసుకొనగా శ్రీ కోర్టు వారు ఆర్డరు మేరకు జప్తు చేయబడినటు వంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తి డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ది. 18-08-2023న ఉదయం 10:30 ని.లకు పై తెలిపిన కోర్టు నందు పబ్లిక్ వేలంలో వేలం వేయుదురు కావున సదరు వేలం పాటలో పాల్గొనదలచినవారు, ఎవ్వరైననూ పాల్గొనవచ్చును అని ఈ వేలం ప్రకటన నోటీసు ద్వారా యవన్మందికి తెలియజేయటమైనది. వేలంపాట యొక్క షరతులుపై తెలిపిన కోర్టు నందు అమ్మీనాగారిని కలిసి తెలుసుకొనవలసినది.
షెడ్యూలు: పల్నాడు డి.డి నరసరావుపేట ఆర్.డి., వినుకొండ సబ్.డి., బొల్లాపల్లి మండలం, గరికపాడు రెవిన్యూ డి.నెం. 127/ఎలోని య. 1-14ట్లు మెట్ట భూమికి హద్దులు- తూర్పు: జొన్నలగడ్డ కోటేశ్వరరావు భూమి దక్షిణం: ముక్కపాటి చిన్న మన్నెయ్య భూమి పడమర: ముక్కపాటి నరసమ్మ. ఉత్తరం: దారి
వేలం తేది: 18-08-2023

పి. సైదారావు, బి. నాగపద్మ
అడ్వకేట్స్, వినుకొండ
సెల్ :9440825595

గిరిజనులపై ప్రభుత్వం వ్యతిరేక విధానం

విశాలాంధ్ర-పర్చూరు: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల పట్ల వ్యతిరేక విధానం అవలంబిస్తుందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనవాస్ తెలిపారు. బొమ్మల సెంటర్‌లో గురువారం ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీలకు జరుగతున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియచేస్తూ.. ప్రభుత్వం కళ్ళు తెరిపించేందుకు నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. దీనికి ముందు ఎన్‌టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, షేక్ షంషుద్దీన్, కార్యదర్శి కొరిటాల సురేష్, పట్టణ అధ్యక్షులు ఏవీ కృష్ణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఊరచెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-అద్దంకి : పట్టణంలోని 20వ వార్డు పరిధిలో ఉన్న ఊరచెరువు అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య తెలిపారు. అమృత్ 2.0 పథకం ద్వారా 98లక్షలతో అభివృద్ధి పరచనున్న ఊరచెరువు అభివృద్ధి పనులకు గురువారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్.ఎస్తే రమ్య, వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద పిల్లలను చదివించాలి

విశాలాంధ్ర-అద్దంకి ; ఇంటి వద్ద తల్లిదండ్రులు వారి పిల్లల చేత ప్రతి రోజు క్రమం తప్పకుండా చదివించాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేరం సుధాకరరెడ్డి అన్నారు. గురువారం ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కటకం శ్రీనివాసరావు అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈనెలలో జరిగిన ఎఫ్ఏవన్ పరీక్షలు వ్రాసిన విద్యార్థుల మార్కులను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి శ్రీనివాసరావు, సుంకర శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి తమలపాకుల పూజ

విశాలాంధ్ర-అద్దంకి ; ప్రసిద్ధి పుణ్యక్షేత్రం సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవ స్థానంలో కొలువై ఉన్న ప్రసన్నాంజనేయస్వామికి గురు వారం ఆలయ వేదపండితులు లక్ష తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలు మార్నిం గ్ స్టార్ ట్రావెల్స్ యజమానులు పొనకాల శ్రీనివాసరావు కుటుంబ సభ్యు లు పాల్గొన్నారు. పూజ అనంతరం ఆలయ వేదపండితులు ఉభయ దాతలను, భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పంట దిగుబడి అంచనా ప్రయోగంపై శిక్షణ

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ అధికారి పి.శ్రీనివాసరావు అధ్యక్షతన పంట దిగుబడి అంచనా ప్రయోగంపై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.దీప్తి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటు పంట సాగులో మెలుకువలను తెలుసుకొని దిగుబడులను పెంచుకునేలాగా రైతు అప్రమత్తంగా పంటను కాపాడుకునే విధంగా సిద్ధం చేయాలన్నారు. పిఏఓ ఎన్.అనూష మాట్లాడుతూ సిసి ప్రయోగంపై రైతులందరూ చీడపీడల నివారణ పై అవగాహన కలిగి ఉండాలా రైతులను సంసిద్ధం చేయాలని శిక్షణలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని విఏవోలు, వీహెచ్‌ఎలు తదితర అధికారులు పాల్గొన్నారు.

హీరో మహేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చీరాలరూరల్ : సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలను చీరాలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లో కేకును కృష్ణ మహేష్ ఫ్యాన్స్ చీరాల అధ్యక్షుడు షేక్ సలాం ఆధ్వర్యంలో కట్ చేశారు. అభిమానులు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేద చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించి, వారి ప్రాణాలను కాపాడిన గొప్ప హృదయం గల మనిషి మహేష్ బాబు అని కొనియాడారు. అంతరిక్షంలోని నక్షత్రానికి మహేష్ బాబు పేరు పెట్టడం సంతోషించదగ్గ విషయం అన్నారు. షేక్ సలాం, న్యాయవాది జి రమేష్, బందరు మిఠాయి వెంకటేశ్వరరావు, కళ్యాణ్, అధిక సంఖ్యలో కృష్ణ మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై మెరుపుదాడి

విశాలాంధ్ర - కర్లపాలెం : పేకాటస్థావరంపై మెరుపుదాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసిన సంఘటన కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శివయ్య తెలిపిన వివరాల మేరకు యాజలి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావటంతో తన సిబ్బందితో దాడి చేయగా 5గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6500 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో అసాంఘీక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఇష్టంగా చదివితే అత్యుత్తమ ఫలితాలు: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - బల్లికురవ : విద్యార్థులు ఇష్టంగా చదివితే ఎంత కష్టతరమైన విద్యను కూడా సులభంగా అర్థం చేసుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని గుంటూరు ప్రకాశం జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొప్పెరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్, ట్రిబుల్ ఐటీ నందు అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని విద్యార్థులు విద్యలో అత్యుత్తమ ప్రతిభను కనపరుస్తున్నారని రాబోవు విద్యా సంవత్సరంలో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కొప్పెరపాడు స్కూల్ నందు ఎన్ఎంఎంఎస్‌లో స్టేట్ 2వ ర్యాంక్ సాధించిన మాదాల హేమ స్రవంతిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా స్టేట్ 2వ ర్యాంక్ సాధించటం ద్వారా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చినవారవుతారన్నారు. సుమారు 65 వేల మంది పరీక్షలు రాయిగా మారుమూల గ్రామం నుండి వచ్చి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాల అధిరోహించాలంటే విద్యార్థులు కృషితో పాటు ఉపాధ్యాయుల అత్యున్నత బోధన ఎంతో అవసరం అన్నారు. మండల పరిధిలోని వివిధ పాఠశాల నుండి ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు లక్ష్మణరావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఒక్కొక్క విద్యార్థికి రూ.1000 చొప్పున నగదు బహుకరించారు. ఉపాధ్యాయ సిబ్బందికి ఘనంగా సన్మానించారు. యుటీఎఫ్ బల్లికురవ మండల శాఖ ఆధ్వర్యంలో పదోన్నతి సాధించిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు, బల్లికురవ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ధూళిపాళ్ళ శేషగిరి, చంటి శ్రీనివాసరెడ్డి, గాలం వీరాంజనేయులు, అజిత్ మోహన్, దాసరి వెంకటేశ్వర్లు, కొప్పురపాడు హైస్కూల్ హెచ్‌ఎం పురంశెట్టి శ్రీనివాసరావు, పేరెంట్ కమిటీ చైర్మన్ దమ్ము అంజయ్య, ఉపాద్యాయని,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - చీరాలరూరల్ : మత్స్యకారుల సంక్షేమం కోసం కృషిచేయాలని జాతీయ మత్స్యకార సంఘం ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ మోస అప్పలరాజు అన్నారు. మండలంలోని వాడరేవు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ మన మత్స్యకారులందరిదీ కులాలు వేరయినా ఒకటే జాతి అన్నారు. జాతీయ మత్స్యకార సంఘాన్ని 1979లో రాజ్యసభ సభ్యుడు బీహేరిరావు స్థాపించారని తెలిపారు. మత్స్యకారులకు రావలసిన వివిధ హక్కులు గురించి కృషి చేశారన్నారు. మత్స్యకారుల సమస్యలపై పార్లమెంటులో మాట్లాడారని, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారని తెలిపారు. సముద్రం తీరం మన హక్కు అనే నినాదం తీసుకువచ్చారని అన్నారు. మత్స్యకారులు చదువు కోవాలని, అన్ని విషయాల మీద అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా జాతీయ మత్స్యకార సంఘం తరఫున అండగా ఉండాన్నారు. గతంలో సంతోష్, సువార్త, జిల్లా కమిటీలో ఉన్నారని గుర్తు చేశారు. మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు వేయాలన్నారు. అందులో భాగంగా చీరాల మండల అధ్యక్షుడిగా ధోని కనకరాజుని ఎన్నుకున్నట్లు తెలిపారు కనకరాజుకి నియామక పత్రాన్ని అందజేశారు కనకరాజు మాట్లాడుతూ వాడే గ్రామ ప్రజలకు తన వంతు చేయగలిగిన సహాయం సహకారాలు అందిస్తా నని యూనియన్ తరుపున కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకారుల సంఘం సేఫ్ ప్రకాశం డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్ విక్కీ సంతోష్ కుమార్, ఎరి పిల్లి రమణ, మచ్చ సువార్త, చేపల గాలి, ధోని రాజు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - మార్టూరు : దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అసువులు అర్పించిన సమరయోధుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోలలపూడి సర్పంచ్ ఎం.సతీష్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కోలలపూడిలో నా దేశం- నాభూమి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించి, జాతీయ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ 75 ఏళ్ళ నాడు స్వాతంత్ర్య ఉద్యమం లో అనేకమంది పాల్గొని వారి జీవితాలను అంకితం చేసారని తెలిపారు. విద్యార్థులు వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. దేశ అభివృద్ధిలో విద్యార్థుల చేయూత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా హైస్కూలు నుండి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఈ. సి రవి కుమార్, కార్యదర్శి శామ్యూల్, విఆర్వో రాంబాబు,ప్రదోనోపాధ్యాయులు ముకుంద రావు,మాజీ సర్పంచ్ కండిమల్ల వెంకటేశ్వరరావు, సురగాని గంగారావు, వీరస్వామి, రేణు బాబు,సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్వాడీ, డ్వాక్రా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకాపా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు

విశాలాంధ్ర - చీరాలరూరల్ : అన్ని రంగాల్లో వైకాపా ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని చీరాల నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. మునిసిపల్ పరిధిలోని తెలుగుదేశం పార్టీ మహాశక్తి, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహిస్తున్న మహిళలను, నియోజకవర్గం నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అన్ని రంగాల్లో పరిపాలన వైఫల్యం చెంది ప్రజలు అసహ్యించుకునే పరిస్థితికి వచ్చింది అని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుపరిచే పథకాలు మినీ మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు తెలిపారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1500, తల్లికి వందనం కింద ఆ ఇంట్లో చదువుకొనే పిల్లలకు రూ. 15 వేలు, గృహిణులకు సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ. 3 వేలు, ఇంటింటికి మంచినీటి కుళాయి కనెక్షను, బీసీలకు రక్షణ చట్టం, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ 20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మనబోయిన రజిని, గజవల్లి శ్రీనివాసరావు, కర్పూరపు సుబ్బలక్ష్మి, కోటి మోహన్, వడ్లమూడి ప్రభాస్, బుర్ల రోశయ్య, లావేటి శ్రీనివాస తేజ, జంగిలి భాస్కర్, శిరందాసు కాళిదాసు, పులిపాటి శేఖర్, పలగర్ల మస్తాన్రావు, నరాల తిరుపతి రాయుడు, పల్లగొర్ల బాలసుబ్రమణ్యం, గుంటి మల్లికార్జున, గుంటూరు మనోహర్, పులిపాటి శేఖర్, కుంచాల శ్రీను, కుంచాల రామాంజనేయులు, కొల్లిపర జాలయ్య, నందం లావణ్య, ఉప్పు శాంతమ్మ, ఎర్ర శివనాగ మల్లేశ్వరి, ఆకురాతి సుజాత, కౌతరపు నాగేశ్వరి, ఆకురాతి సుజాత, కూరపాటి వరలక్ష్మి, కూరపాటి సుభద్ర, పొట్టేటి రాజేశ్వరి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలికి కుంభా రవిబాబు

విశాలాంధ్ర - బాపట్ల : గవర్నరు కోటాలో ఖాళీగా ఉన్న ఇద్దరు శాసన మండలి సభ్యుల స్థానాలను భర్తీ చేస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఉత్తర్వులను జారీ చేశారు. గవర్నర్‌చే నామినేట్ చేయబడిన డాక్టర్ కుంభా రవిబాబు,కర్రి పద్మ శ్రీ లను శాసన మండలి సభ్యులుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.బాపట్ల మండలం నరసాయపాలెంకు చెందిన కుంభా రవిబాబు గతంలో కాంగ్రెస్ తరపున శృంగవరపు కోట నుండి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత వైసిపి పార్టీలో చేరిన ఆయన ఇటీవల వరకు రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్‌గా ఉన్నారు. ఉన్నత విద్యావంతుడైన రవిబాబు వైసీపీలో కీలకమైన నాయకుడుగా ఎదుగుతూ వస్తున్నారు. తాజాగా గవర్నర్ కోటాలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి వరించింది. ఈ సందర్భంగా పలువురు రవిబాబుకు అభినందనలు తెలిపారు.

ఎస్పీ వకుల్‌జిందాల్‌కు అభినందన

విశాలాంధ్ర - బాపట్ల : రేపల్లెలో జరిగిన హత్యాచార కేసులో నిందితులకు జైలు శిక్ష పడటంలో విశేష కృషి చేసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను గురువారం పలు సంఘాల నేతలు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మానవత్వం మరిచేలా క్రూరంగా మృగాల్లా మారి రేపల్లె రైల్వే స్టేషన్‌లో నిద్రపోతున్న గర్భిణీపై ఆమె భర్త ముందే అత్యాచారం చేసిన నిందితులకు కోర్టు 20 ఏళ్ళ జైలు శిక్ష విధించింది. ఈ కేసు నమోదైనప్పటి నుంచి నిందితులకు శిక్ష పడే వరకు ఎస్పీ పట్టు వదలని విక్రమార్కుడి లాగా కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించి, ట్రయిల్ మోనిటరింగ్ చేశారు. గురువారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో పలువురు అధికారులు, ప్రజాసంఘాల నేతలు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఏ. శ్రీనివాస్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ బాల మురళికృష్ణ, బాపట్ల పట్టణ సీఐ పి.కృష్ణయ్య పలువురు పోలీసు అధికారులు ఎస్పీని అభినందించారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఈ శిక్ష సరైన సమాధానమని, కఠోర శ్రమ చేసిన జిల్లా ఎస్పీ సేవలు ఎంతో అభినందించదగినవి కొనియాడారు.

మహనీయుల త్యాగాలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర - బల్లికురవ : దేశం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు వెలకట్టలేని వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని శాపు నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, బల్లికురవ,ముక్తేశ్వరం,చెన్నుపల్లి గ్రామాలలో ఆజాది కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద నా మట్టి-నా దేశం,వీరులకు వందనం,మొక్కల నాటడం,జెండా ఆవిష్కరణ,ర్యాలీలు నిర్వహించడం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గుంటుపల్లి లో జరిగిన నా మట్టి-నాదేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారి ప్రాణాలను ఫణంగా పెట్టి అమరులైన వారిని స్మరించుకుంటూ వారి కుటుంబాలను పరామర్శించి సత్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవిబాబు,ఎంపీడీవో సిహెచ్ కృష్ణ,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి,పంచాయతీరాజ్ ఏఈ హనుమంతరావు,ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

31న చలో స్టువర్టుపురం సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ఆదివాసీ సంఘాలు ఆధ్వర్యంలో ఆగస్టు 31వ తేదీన పిలుపునిచ్చిన చలో స్టువార్టుపురం సభను జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ నెంబర్ కొండారెడ్డి నరహరి ప్రసాద్ మాట్లాడుతూ టైగర్ నాగేశ్వరరావు, స్టువర్టుపురం దొంగ సినిమాలను నిర్మాణాన్ని తక్షణం నిలిపివేయాలన్నారు. స్టువర్టుపురం గిరిజనులను దొంగలుగా చిత్రీకరించడాన్ని సమాజానికి ఈనాటికి నేరస్తులుగా చూపిస్తున్న,చూపించబోయే సినిమాలను తక్షణం నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీఎస్పీ నాయకులు భగత్ సింగ్ మట్లాడుతూ మనం పుట్టుకతో దొంగలు, నేరస్తులం కాదని గ్రామస్తులు చాలామంది ఉన్నతమైన విద్యను అభ్యసించి,ఐఏఎస్, ఐపీఎస్, లాంటి ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఆదివాసీ ఆత్మ గౌరవాన్ని మన పరువుని మట్టి కలుపుతున్న సినిమాలను నిలివేసే వరకు శాంతియుతంగా పోరాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటి అధ్యక్షులు చుక్కా పౌల్ రాజు, ఉపా అధ్యక్షులు దేవర వసంతరావు, రాగల రాము కార్యదర్శి, కోశాధికారి పేరం రవికుమార్, గ్రామ సర్పంచ్ బొగిరి ప్రసాద్, బహుజన సమాజ్ వాది పార్టీ కోటేశ్వరరావు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నులిమేద్దామని కూచినపూడి పీహెచ్‌సీ వైద్యశాల సూపర్వైజర్ మురళి పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని దిండి ప్రభుత్వ పాఠశాల, అడవులదీవి జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ముందుగా విద్యార్థులతో హ్యాండ్ వాష్ చేయించారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగులతో పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. 2నుంచి 19 సంవత్సరాల పిల్లలకు నులిపురుగుల నివారణ కొరకు మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాత్రలు వేసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఈ మాత్రల వల్ల అనీమియా (కడుపు నొప్పి), రక్త హీనత, బుద్ధి మాంద్యం, సోమరితనం, తదితర వ్యాధుల నివారణకు అవకాశం కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - బల్లికురవ : జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని 10190 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి మమత తెలిపారు. అన్ని గ్రామాలలోని పాఠశాలలో స్కూల్ హెచ్‌ఎం, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు మధ్యాహ్నం భోజనం చేశాక విద్యార్థిని, విద్యార్థులతో మాత్రలు మింగించారు. గుంటుపల్లిలోని కేజీబీవీ పాఠశాలలో తహశీల్దార్ రవిబాబు, ఎంపీడీవో సిహెచ్ కృష్ణ మాత్రలు పంపిణీ చేశారు. సూపర్వైజర్లు శ్రీనివాసరావు, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి,ఆశ మరియు వైద్య సిబ్బంది కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్లపాలెం : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నులిపురుగుల నివారణ మాత్రలు చిన్నారులకు తప్పక ఇవ్వాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు,నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. మండలంలోని నల్లమోతువారిపాలెం వెన్నెలగంటి నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గురువారం నులిపురుగుల మాత్రలను ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం ఆహార పదార్థాల విషయంలోనూ పాటించవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం రత్న మాల, విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టంట్ అనూష, అంగన్‌వాడి ఏసీడీపీవో శివ పార్వతి, అంగన్‌వాడి సూపర్వైజర్ సౌజన్య, అంగన్ వాడి టీచర్స్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - యద్దనపూడి : జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోనీ 9500 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి సుభాషిని తెలిపారు. అన్ని గ్రామాలలోని పాఠశాలలు, యద్దనపూడి గురుకుల పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ టీవీఎస్ ప్రసాదు వైద్య సిబ్బంది ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - చీరాల : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పేరాల ఆంధ్రరత్న మునిసిపల్ హైస్కూల్‌లో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు గురువారం వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. పలువురు ఏరియా ఆస్పత్రికి చెందిన వైద్యులు నులిపురుగుల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం నులిపురుగుల నివారణకు అల్బెన్డజోల్ 400 మాత్రలని విద్యార్థులతో మింగించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కమిషనర్ రామచంద్రా రెడ్డి, హెచ్‌ఎంబి.సాల్మన్,కౌన్సిలర్ మల్లెల లలితా రాజశేఖర్,వైద్యులు మనీష్,స్వాతికిరణ్, ప్రణయ్ యాకూబ్, ఉపాధ్యాయులు భానుచంద్ర, వెలుగొండా రెడ్డి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమోతువారిపాలెలో నా భూమి నా దేశం

విశాలాంధ్ర - కర్లపాలెం : నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో గురువారం జెండా వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల చేత మొక్కలు నాటించి గ్రామస్తులకు స్వాతంత్ర సమర యోధుల గురించి యుద్ధ వీరులను గౌరవించు కోవాలసిన ఆవశ్యకత, నా భూమి నా దేశం కార్యక్రమం యొక్క విశిష్టతను ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు డీపీవో రాంబాబు వివరించారు. డీపీవో రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వాతంత్ర్య సమర యోధుల ను స్మరించుకుని దేశభక్తిని చాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వెంకటేశ్వర రావు,స్కూల్ టీచర్లు, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA, ANDHRA PRADESH.
IA No: 251/2023 IN O S No: 1112/2019.

Between:
M/s. International Health Care Rep by its GPA Holder Arepalli Siva Suresh Babu
.... Petitioner / Plaintiff
And
M/s. Sri Bala Tripura Sundhari Aqua Feeds Represented by its Proprietor Smt. Yenumula Lakshmi Siva Leela
....Respondent / Defendant

DEFENDANT ADDRESS:
Smt.Yenumula Lakshmi Siva Leela as Proprietor W/o Sri. Yenumula Gudaru Venkaiah M/s Sri Bala Tripura Sundari Aqua Feeds, Hindu, Aged about 43 years, Main Road, Karlapalem Village, Guntur District, AP-522111.

The above Suit is filed by Plaintiff before the Hon'ble Court against Defendant. The Suit is posted for your appearance on **16/08/2023 at 10.30 AM**. Respondent / Defendant is advised to appear in person or with his Advocate for objections if any in the suit, failing which the Hon'ble Court may be, pass appropriate order against you. This notice is issued according to the Orders of this Hon'ble Court.

DATE OF ADJOURNMENT : 16/08/2023, AT 10.30 AM

YSV PRATAP, SPR KUMAR
Advocates, Rao & Rao Associates, Door No:24-28-6/5, FF-1, Nagendra Towers, Edupuganti Lakshmana Rao Street, Durgapuram, Vijayawada-520 003. Andhra Pradesh. Ph: 85000 14509
AP/2752/2007, AP/2135/1998

ప్రజాభిప్రాయాలతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు నియోజకవర్గంలోని అత్యధిక జనాభా కలిగిన అంబేద్కర్‌వాదులను,ప్రజా సంఘాల నాయకులను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సబాభని చీరాల మునిసిపల్ కమిషనర్‌ను ప్రజావేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం ప్రశ్నించారు. గురువారం చీరాల అంబేద్కర్ సర్కిల్లో నిర్మాణం చేపడుతున్న అంబేద్కర్ విగ్రహ పనులను ప్రజా సంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు పరిశీలించి,చీరాల మునిసిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ చీరాల నియోజకవర్గనీకె తలమానికంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.నేటి పాలకులు చీరాల ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏకపక్ష ధోరణితో విగ్రహ నిర్మాణం చేపడుతున్నారని ఇది ఆక్షేపనీయమన్నారు.డాక్టర్ అమృతపాణి మాట్లాడుతూ చీరాలలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహం ఏర్పాటు చేసేటప్పుడు ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలతో ఒకటికి పదిసార్లు సంప్రదింపులు జరిపారని ప్రపంచ మేధావి విగ్రహ ఏర్పాటుకు కనీసం కమిటీ వేసే తీరిక కూడా ఈ కౌన్సిల్‌కు లేదని ఇప్పటికైనా మారాలని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో పాలకుల నిర్లక్ష్యం కనబడుతుందని ప్రపంచ మేధావికి మీరిచ్చే గౌరవం ఇదేనా అని పాత విగ్రహాన్ని తొలగించెటప్పుడు అట్టహాసం కాకపోయినా చిత్తశుద్ధితో పాలాభిషేకం చేసి పాదాభివందనం చేసి పూలరథంతో తొలగించాల్సిన మునిసిపల్ కౌన్సిల్,నిర్లక్ష్యంగా వ్యవహరించిందని,ప్రజా స్వామ్యవాదులకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. బిఎస్పీ ఇంచార్జి రవికుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు నియోజకవర్గ ప్రజలు గర్వంగా తలెత్తేలా అట్టహాసంగా శంకుస్థాపన చేయాల్సిన పాలకులు వివక్ష చూపించారని కనీసం ఏ నమూనా ప్రకారం విగ్రహం ఏర్పాటు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు.కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు మాట్లాడుతూ అంబేద్కర్ పాత విగ్రహ తరలింపుకు చెత్త బండి పెట్టి తరలించాలనుకోవడం భారత జాతి తలదించుకునేలా చేయడమేనని ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దామర్ల శ్రీ కృష్ణ, నూకతోటి బాబురావు,దుడ్డు విజయ సుందర్, మణి బాబు,లక్ష్మి నరసయ్య,లింగం జయరాజు,సంఘమిత్ర సేవా సొసైటీ అధ్యక్షులు గుమ్మడి సూర్య ప్రకాష్,షేక్ జిలానీ, చిరంజీవి, శీలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వేటపాలెంలో వైసీపీ నేతల వీరంగం

ఆమంచి కరణం వర్గీయుల బాహాబాహీ

విశాలాంధ్ర - బాపట్ల : ఇటీవల ఎన్నికల కమీషన్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో జరగనున్న పంచాయతీ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి దాఖలు చేస్తున్న నామినేషన్లలో చీరాలలో వైసీపీలో ఉన్న వర్గపోరుతో రణరంగంగా మారింది. రెండు వర్గాల నేతలు రాళ్లతో దాడులు చేసుకుని పిడుగుద్దులు గుద్దుకున్నారు. అడ్డు వచ్చిన పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో మహిళా కానిస్టేబుల్ సునీత తలకు తీవ్ర గాయం కావటంతో నడిరోడ్డుపై కుప్పకూలిపోయింది. వైసీపీ నేతలు ఆమంచి కృష్ణమోహన్ కరణం వెంకటేష్ బాబు వర్గీయులు వేటపాలెం మండలం రామన్నపేట మండల పరిషత్ ప్రాంగణం ఎదురు నడిరోడ్డుపై కర్రలు ఇనుపరాడులు రాళ్లతో దాడి చేసుకున్నారు. రామన్నపేట గ్రామపంచాయతీకి బై ఎలక్షన్స్ సందర్భంగా 6,10 వార్డులకు ఆమంచి కృష్ణమోహన్ కరణం వెంకటేష్ బాబు వర్గీయులు నామినేషన్లు వేసే క్రమంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఉదయం 12 గంటలకు వేటపాలెం మండల జడ్పిటిసి బండ్ల తిరుమల దేవి భర్త రామన్నపేట పంచాయతీ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీస్‌లోకి వెళ్ళాడు. అదే సమయంలో అక్కడే ఉన్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పిఏ త్రివేణికి బండ్ల బాబుకి మధ్య వాదన జరిగింది. దీంతో కరణం వర్గీయులు బండ్ల బాబుపై దాడికి దిగారు. ఈ దాడిలో ఆయన కంటికి గాయంమైంది. దీంతో సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్సై జి.సురేష్ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించటంతో చీరాల రూరల్ సీఐ ఏ.మల్లికార్జున రావు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఐ.కాసి విశ్వనాథం దగ్గర ఘర్షణకు దారి తీసిన వివరాలు సేకరించారు. అనంతరం ప్రత్యేక బలగాలను పిలిపించి పరిస్థితిని అదుపులోకి తీసుకుని వచ్చారు. విషయం తెలుసుకున్న ఆమంచి కృష్ణమోహన్ కరణం వెంకటేష్ బాబులు వేరువేరుగా తన అనుచరులతో ఆ ప్రాంగణంలోకి వచ్చారు. సాయంత్రం ఐదు గంటలు నామినేషన్ల ఘట్టం పూర్తి అయిపోయిన తరువాత నడిరోడ్డుపై ఇరువురు అనుచరులు రాళ్లు కర్రలతో మోహరించి కవింపు చర్యలకు దిగారు.

బీజేపీ, జనసేనల మహా నిరసన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను దారి మళ్లించి సర్పంచ్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేశారంటూ జిల్లా కలెక్టరేట్ రోడ్‌లో బిజెపి, జనసేన ఆధ్వర్యంలో మహా నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు ముప్పల వెంకటరమణ మాట్లాడుతూ గ్రామల అభివృద్ధికి నిధులు లేక చేపట్టలేకపోతున్న తరుణంలో కేంద్రం ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయటం లేదన్నారు.జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ నిధుల్లో పారిశుద్ధం రోడ్లు డ్రైన్లు నిర్వహణకు, వీధి దీపాలు తాగునీటి అవసరాలకు 30 శాతం వరకు వెచ్చించాలన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్ భాషాకు వినతి పత్రం సమర్పించారు. బీజీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జివిల్ మోహన్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ శాస్త్రి, బిజెపి జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు నాసర్ మణికుమార్ బిజెపి జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.